క్లుప్తంగా

రామలింగేశ్వర ఆలయంలో పూజలు



రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నదిలో కొలువైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్థానిక భక్తులతో పాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన వారు స్వామివారికి అర్చనలు, గంగాభిషేకం, బిల్వాభిషేకం, మంగళహారతి, విశేష పూజలు చేశారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. శివ సంకీర్తనలతో భక్తులు స్వామి సన్నిధిలో గడిపారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి వివిధ అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివునికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

లింగయ్యకు సన్మానం



వనపర్తిటౌన్: పిల్లల్లోని అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు బస్ లింగయ్య అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. వేసవి శిబిరం ఏర్పాటు చేసి పట్టణంలోని పిల్లలకు లింగయ్య చిత్రకళలో శిక్షణ ఇస్తున్నాడు. ఈ మేరకు ఆయనను సాహితీవేత్తలు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. దాదాపు 30 మంది విద్యార్థులు వేసవి సెలవుల్లో లింగయ్య వద్ద చిత్రలేఖనంలో శిక్షణ పొందారని తెలిపారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలు, పాటలు, డ్రాయింగ్, డాన్స్, తదితర అంశాలల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి, వారిని అందులో చురుగ్గా చేయాలని, కళలు మానసిక ఆనందంతో పాటు, ఏకాగ్రతను పెంపొందిస్తాయన్నారు. బస్ లింగయ్య 36 ఏళ్లుగా డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తూ ఎంతో మందిని తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, బొజ్జి బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



కొత్తకోట రూరల్: బండల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలంలోని మిరాసిపల్లి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ వైపు నుంచి లారీ బండల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తుండగా మిరాసిపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే లారీలో సాంకేతిక లోపం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బండలు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది ఎంతో శ్రమించి బండలను, లారీని పక్కకు తీసి ట్రాఫిక్ క్రమద్ధీకరించారు. డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలు కావడంతో అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రూప్‌-1 పరీక్షకు అర్థరహిత నిబంధనలు

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్‌-1 పరీక్షలకు సంబంధించి అర్థరహిత నిబంధనలను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ గృహిణులు తాళి బొట్లు, మెట్టెలు తీసివేసి పరీక్షలకు హాజరు కావాలనే నిబంధనపై మండిపడ్డారు. హిందూ స్త్రీలు తాళి, మెట్టెలు భర్త మరణించనప్పుడు మాత్రమే తొలగిస్తారని, అందువల్ల ఈ నిబంధనలు సరికాదన్నారు. నిబంధనలు సడలించకుంటే ఏఎస్ఎఫ్ఐ ఏఐ వైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విష్ణు, రాంబాబు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే



జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ
- ఇప్పటి వరకు 70శాతం సర్వే పూర్తి



ధరూరు మండలం ఉప్పేరులో కుటుంబ సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం నేరుగా లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వం ఇంటింటా సర్వే చేపడుతోంది. న్యూట్రీషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పేరిట సర్వే చేపడుతున్నారు. ఇంట్లోని కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే మార్చి నెలలో ప్రారంభం కాగా, ఎన్నికల కోడ్ రావడంతో నెమ్మదిగా సాగింది. ఎన్నికలు ముగియడంతో మళ్లీ సర్వే పనులు వేగవంతం చేశారు.

262 అంగన్‌వాడీ సెంటర్లు

గద్వాల, గద్వాల రూరల్, ధరూరు, కేటీదొడ్డి మండలాల పరిధిలోని ఆయా గ్రామాలు గద్వాల అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 262 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే కొనసాగుతోంది. ప్రతి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, వయస్సు, సెల్ నెంబర్, కులం, ఆధార్ కార్డు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. బాలింతలు, 6ఏళ్లలోపు చిన్నారులు, దివ్యాంగుల వివరాలను సైతం నమోదు చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు అందించిన సెల్‌ఫోన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. వివరాల నమోదు, సర్వే అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు ఐసీడీఎస్‌లోని గద్వాల అర్బన్ పరిధిలో ఇప్పటి వరకు 70శాతం సర్వే పూర్తి చేశారు. మిగిలిన 30శాతం సర్వే పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారు.

సర్వేతో పోషకాహార లోపం చిన్నారుల వివరాలు తెలుస్తుంది.

అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం తదితర పౌష్టికాహారం అందిస్తారు. గతంలో లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందడం లేదనే ఆరోపణలకు చెక్‌పడనుంది. ఈ సర్వే ప్రక్రియతో నమోదైన బాలింతలు, గర్భిణుల వివరాల ఆధారంగా పౌష్టికాహారం అందనుంది. ఇకపై లబ్ధిదారులు నేరుగా కేంద్రానికి వచ్చి భోజనం చేస్తేనే హాజరైనట్లుగా, కేంద్రానికి రాకుంటే చరవాణికి సంక్షిప్త సందేశం వెళ్తుంది. ఈ సర్వేతో తీవ్ర పోషకాహార సమస్యతో బాధపడే పిల్లల సంఖ్య తెలుస్తుంది.

నమోదైన వివరాల ఆధారంగానే పౌష్టికాహారం

నిజమైన గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ చిన్నారులు, ఎంత మంది సేవలు అందుతున్నాయి. ఆరోగ్యవంతంగా ఎంత మంది ఉన్నారనే డాటా కోసమే కుటుంబ సర్వే చేపడుతుంది. కుటుంబ సర్వేలో నమోదైన బాలింతలు, గర్భిణులు, చిన్నారుల వివరాల ఆధారంగా ప్రభుత్వం నుంచి పౌష్టికాహారం వస్తుంది. దీంతో అంగన్‌వాడీ సెంటర్లపై ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది. ఈనెలాఖరులోగా సర్వేను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. గడువులోగా సర్వేను పూర్తి చేస్తాం.

– హేమలత, సీడీపీఓ, గద్వాల అర్బన్ ప్రాజెక్టు

ఐసీడీఎస్, వైద్యశాఖల సమన్వయం

మార్చి నెలలో ప్రారంభమైన న్యూట్రీషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం సర్వే ఇప్పటి వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టారు. అయితే ఈ వారం నుంచి ఐసీడీఎస్, వైద్యశాఖల సమన్వయంతో సర్వే చేపట్టనున్నారు. ఇప్పటికే వీటిపై ఐసీడీఎస్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు హైదరాబాద్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేయనున్నారు.

ఉభయలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకలు



ఉభయ రామలింగేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు



హోమం నిర్వహిస్తున్న దంపతులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో వెలసిన ఉభయ రామలింగేశ్వరస్వామి వారి కల్యాణవేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ధర్మకర్తలు ఆర్‌ఎస్ బీచుపల్లి, గజేందర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామివారి ఆరాధనలో మునిగితేలారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన ఆలయం, విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగిన 41 రోజుల్లో స్వామివారి కల్యాణం, హోమాలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. నంద్యాల శషిభూషణ సిద్ధాంతి, పురోహితుడు రవిశాస్త్రి సమక్షంలో కనులపండువగా నిర్వహించారు. 41 రోజులపాటు నిష్ఠగా భక్తిశ్రద్ధలతో ఉన్నందున గ్రామస్తులందరికి ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు ఆలపించిన సంకీర్తనలతో ఆలయ మార్మోగింది.

మెరిట్ విద్యార్థులకు ఉచిత విద్య

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) వారు ఉచిత విద్య అందించేందుకు ముందుకొచ్చారు. ప్రతి ఏటా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారు ఇంటర్మీడియట్ చదివేందుకు కావల్సిన ఫీజులు ట్రస్ట్ తరుపున చెల్లిస్తారని ప్రధానోపాధ్యాయులు హేమలత తెలిపారు. రు. 2024–26 సంవత్సరానికి సమీర్ 9.7, మహాలక్ష్మి 8.7 ఉత్తీర్ణత సాధించడంతో వారిని ఆర్డీటీ ప్రతినిధులు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధులు రామేశ్వరి, సుదర్శన్‌రెడ్డి, రహనాబి, ఉపాధ్యాయులు సుందర్‌రెడ్డి, భరత్ కుమార్, బీచుపల్లి, రైతు సంఘం సభ్యులు శ్రీరాములు, గ్రామస్తులు సొంటి శ్రీనివాసులు, కృష్ణ, పాల్గొన్నారు.

పూతదశలో వేరుశనగ



ఎక్లాస్‌పురం శివారులో సాగుచేసిన వేరుశనగ

అయిజ: సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వేరుశనుగ పంట పూతదశలో కలకలలాడుతోంది. దీంతో రైతుల ఆశలు చిగురించి అన్నదాతల ముఖంలో ఆనందం చోటుచేసుకుంది. మండలంలోని వివిధ గ్రామ శివార్లలో మే నెలలో బోరు బావుల కింద రైతులు వేరుశనుగను కత్తెర పంటగా సాగు చేశారు. ఎండలు తీవ్రతరంగా మారడంతో వాతావరణంలో తేమశాతం లేకపోవడంతో వేరుశనగ పంట పెరుగుదల నిలిచి పోయింది. దానికి తోడు బోరు బావుల్లో భూగర్భ జలాలు అంతరించిపోవడంతో వేరుశనగ పంట ఎండుముఖం పట్టింది. మే 8న కురిసిన వర్షానికి వేరుశనగ పంట ఊపిరి పోసుకుంది. 13న కురిసిన వర్షంతో పంటపొలంలో సరిపడినంత తేమ శాతం రావడంతో పంట చిగురించింది. అప్పటినుంచి ఇప్పటి వరకు వానలు కురువకపోవడంతో వేరుశనగ పంట పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో వేరుశనగ పంట ఊపిరి పోసుకుంది.

బాధిత కుటుంబానికి నేతల పరామర్శ



ధరూరు: మండలంలోని చింతరేవుల గ్రామానికి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్ తల్లి కేశమ్మ(65) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు చింతరేవుల గ్రామానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ నల్లారెడ్డి, నాయకులు వెంకటేష్, సూరి, లక్ష్మన్న ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు



ధరూరులో రాయచూర్ రోడ్డు వద్ద మరమ్మతు పనులు చేయించి కాలనీ వాసులతో మాట్లాడుతున్న బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి

- రాయచూర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు
- కాల్వల ఏర్పాటుతో పాటు మొర్రం నింపిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎరుకలి వీధి వాసులు

ధరూరు: గద్వాల – రాయచూర్ రహదారిలోని ధరూరులో కొన్నేళ్లుగా ఉన్న సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించింది. గద్వాల–రాయచూర్ ప్రధాన రహదారిలో భాగంగా మండల కేంద్రంలోని ఎరుకలి వీధి లోతట్టు ప్రాంతం కావడంతో నీళ్లు నిలిచి బీటీ రోడ్డు అంతా గుంతలమయంగా తయారైంది. దీంతో ఏడాది పొడవునా ఇబ్బందులకు గురవుతు వస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి గుంతల్లో నీళ్లు నిలవడంతో పాటు బయటకు వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి ఆ ప్రాంతం అంతా నీళ్లతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. దీంతో గ్రామస్తులు విషయాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే అక్కడకు చేరుకుని ప్రత్యేకాధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని, తాను కూడా ఇక్కడే ఉంటానని చెప్పడంతో వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని పనులు ప్రారంభించారు. ప్రత్యేక అధికారులతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడ రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు రోడ్డుకు ఇరు వైపులా కాలువలు తవ్వించారు. గుంతల్లో మొర్రం మట్టిని నింపించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. సాయంత్రం పొద్దుపోయే వరకు పనులు చేయించారు. వర్షాలు లేని సమయంలో దుమ్ముతో రోడ్డుకు ఇరు వైపున ఉన్న కాలనీ వాసులు ఇబ్బందికి గురవుతున్నామని, శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్డు వేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. మరమ్మతు పనుల వద్ద ఎంపీపీ నజీమున్నీసా బేగం, తాజా మాజీ ఉప సర్పంచు సవారన్న, కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అక్కడే ఉండి పనులు చేయించారు. మరమ్మతు పనులు చేయించడం పట్ల రోడ్డుకు ఇరు వైపులా ఉన్న కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మించండి



మానవపాడు గుంతలతో ప్రధాన రహదారి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మానవపాడు వాగు నుంచి మండల కేంద్రంలోని సవిడి వెళ్లే దారిలో మట్టి రోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా రోజులుగా అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే గుంతల్లో నీలు చేరి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీచుపల్లి క్షేత్రంలో ఎమ్మెల్సీ పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని సోమవారం ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఈఓ రామన్‌గౌడ్ వారిని శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ మీద ఉన్న అభిమానం ఎప్పటికి చెరిగిపోదన్నారు. బీచుపల్లి అంజన్న సాక్షిగా మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గట్టు యాదవ్, దిలీప్‌రెడ్డి, పద్మా వెంకటేష్, నరేష్, వేణు, శాంతన్న ఉన్నారు.

మురుగు ఇలా.. ప్రయాణం ఎలా?



కొత్తబస్టాండ్‌లో ప్రధానరోడ్డుపై నిలిచిన మురుగు

అయిజ: సోమవారం తెల్లవారుజామున కురిసిన తేలికపాటి వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులపై మురుగు నిలిచింది. మున్సిపాలిటీలో కొత్త బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు మురుగు నిలిచి పోతుంది. కనీసం కాలినడకన నడిచేందుకు కూడా వీలు కావడంలేదు. డ్రెయినేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉండడం, ప్రణాళిక లేకుండా నిర్మించడం, సాంకేతిక విషయాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం వంటి అనేక కారణాల వల్ల పట్టణంలోని ప్రధాన రోడ్లు మురుగుతో నిండిపోతున్నాయి. పట్టణంలోని వివిధ వార్డుల్లో, వివధ కాలనీల్లో మురుగు నిలిచిపోయింది. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు, పాలకులు స్పందించి పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్నలు..



తుమ్మిళ్ల శివారులో పొలంలో నిలిచిన వర్షపు నీరు



శాంతినగర్‌లో ఇళ్లమధ్యలో నీరు నిల్వడంతో జేసీబీతో దారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజోళి: మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. మండల కేంద్రంతో పాటు మాన్‌దొడ్డి, పచ్చర్ల, తుమ్మిళ్ల తదితర గ్రామాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో రైతులు తమ భూములు పదును పరిశీలించారు. చాలా మంది రైతులు ఇప్పటికే దుక్కులు దున్నుకోగా, తాజాగా మరికొందరు దుక్కులు దున్నేందుకు సిద్ధమయ్యారు. మరి కొందరు విత్తనాలు వేశారు. కాగా ఎక్కువగా వరి మడి కోసం వేసుకున్న నారుమడికి రైతులు ఎరువులు చల్లి నాట్లకు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కురిసిన వర్షంతో రైతులు ఇలా ఉండగా.. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ బురదమయంగా మారాయి. గుంతలు, అతుకులమయంగా ఉన్న రోడ్లపై వర్షం కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వడ్డేపల్లి మండలంలో భారీ వర్షం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం కురవడంతో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శాంతినగర్‌లోని ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిల్వడంతో కుంటను తలపించాయి. దీంతో అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు జేసీబీతో వర్షపునీరు వెళ్లేందుకు కాలువలు తీసి నీటిని తరలించారు. మంగళవారం నుంచి విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు. మెట్టపొలాల్లో పత్తి, కందులు, ఆముదాలు, కొర్రలు విత్తనాలు విత్తేందుకు రైతులు సమయత్తమయ్యారు.

ధరూరు మండలంలో..

ధరూరు: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని దోర్నాల, మన్నాపురం, గుడ్డెందొడ్డి, పారుచర్ల, మార్లబీడు, నీలహళ్లి, నెట్టెంపాడు, ద్యాగదొడ్డి, బూరెడ్డిపల్లి, మాల్‌దొడ్డి, ర్యాలంపాడు తదితర గ్రామాల్లో వాన కురిసింది. కురిసిన వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మెట్ట పంటల్లో విత్తనాలు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింకకు ప్రథమ చికిత్స నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది

పాన్‌గల్: వ్యవసాయ పొలంలో మేత కోసం వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాధరావుపల్లి సమీపంలోకి మేత కోసం వచ్చిన జింకను కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో గ్రామస్తులు, రైతులు గమనించి జింకను కాపాడారు. ఆ జింకను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో పోలీసులు వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం మండల పశువైద్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన జింకకు పశువైద్య సిబ్బంది కుట్లు వేసే క్రమంలో జింక మృత్యువాత పడింది. మృతిచెందిన జింకను ఫారెస్టు అధికారులు పంచనామా నమోదు చేసుకొని జిల్లా కార్యాలయానికి తరలించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఖననం చేయనున్నట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ 18వ తేదీన కూడా పాన్‌గల్‌లో కుక్కల దాడిలో జింక చనిపోయింది. మండలంలో ఇలాంటి ఘటనలు ఇప్పటికే రెండు జరిగాయి. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవ పూజలు



అమరచింతలోని జములమ్మ ఆలయంలో హోమంలో పాల్గొన్న దంపతులు



సూగూర్‌లో..

అమరచింత: పట్టణంలోని జములమ్మ దేవత ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో జములమ్మ దేవత మూర్తి విగ్రహా ప్రతిష్ఠ జరిగి పదేళ్లు పూర్తి చేసుకోవడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు మాట్లాడుతూ ఆలయ నిర్వహణకు పట్టణ ప్రజల సహకారంతో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అమ్మవారి దీవెనలతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌శెట్టి, పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని సూగూరులో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. గడిచిన పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. దేశంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేశారని మండల అధ్యక్షుడు మోహన్‌సాగర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమ్మరి నారాయణ, తరుణ్, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌లో ఉత్తీర్ణత

ఉండవెల్లి: జిల్లాలోని కేటీదొడ్డి మండలంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు పాలిసెట్‌లో ఉత్తమ ఫలితాలను సాధించారు. సోమవారం పాలిసెట్ ఫలితాలు విడుదలైన క్రమంలో మండల కేంద్రానికి చెందిన గొల్ల గణేష్ బైపీసీలో 82 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. కంచుపాడుకు చెందిన గొల్ల అనిల్ కుమార్ బైపీసీలో 79వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.